మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 17 బుధవారం 20 మే 2026 పేజిలు :08 వెల:రూ.5/-

## ప్లాస్టిక్ ముప్పు



2లో..

## పెండింగ్ బిల్లుల చెల్లింపులకు

# గ్రీన్ సిగ్నల్

- పాలమూరు ప్రాజెక్టుపై సీఎం ఫోకస్
- భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- సాగునీటి పనులపై నిరంతర పర్యవేక్షణ





**హైదరాబాద్, 19 మే (మన ప్రజాగళం):** తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి పథకాలలో ఒకటైన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పేర్కొంటూ, ఈ అంశంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలమూరు ప్రాంత అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ముఖ్యమంత్రి ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు,

మిగతా 2 లో..

## పారిశుధ్యంపై జాతీయ సమీక్ష

- ఢిల్లీలో స్వచ్ఛ భారత్ సమావేశానికి హాజరైన భట్టి
- పట్టణ పారిశుధ్య పురోగతిపై విస్తృత చర్చ
- సఫాయిమిత్రల భద్రతకు ప్రాధాన్యంపై దృష్టి



**న్యూఢిల్లీ, 19 మే (మన ప్రజాగళం):** స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ రెండో దశ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన జాతీయ సమీక్ష సమావేశంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా పట్టణ పారిశుధ్య పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ఈ సందర్భంగా

మిగతా 2 లో..

## భగీరథ్ కేసులో సిట్ ఏర్పాటు

- న్యాయమూర్తిపై సోషల్ మీడియా పోస్టులపై దర్యాప్తు
- జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలో ప్రత్యేక బృందం
- దుష్ప్రచార మూలాలపై లోతైన విచారణ ప్రారంభం

**హైదరాబాద్, 19 మే (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు



మిగతా 2 లో..

## తెలంగాణలో బీజేపీయే ప్రత్యామ్నాయమన్న రాంచందర్ రావు

- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర నాయకత్వం
- మోదీ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు

**హైదరాబాద్, 19 మే (మన ప్రజాగళం):** తెలంగాణలో భారతీయ జనతా పార్టీనే ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయంగా మారుతోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. హైదరాబాద్ బర్కత్‌పురాలోని నగర బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకురాలు రేఖా శర్మతో కలిసి పాల్గొన్న ఆయన పార్టీ భవిష్యత్ వ్యూహాలు, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని పన్నెండు సంవత్సరాల పాలనలో దేశం సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నిర్ణయాత్మక నాయకత్వం, అభివృద్ధి ఆధారిత పాలనతో దేశం అనేక రంగాల్లో ముందుకు వెళ్లిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.



మిగతా 2 లో..

## భారత్--నార్వే సంబంధాలకు

# కొత్త ఊపు

- గ్రీన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం
- ఓస్లోలో నార్వే ప్రధాని తో మోదీ కీలక చర్చలు
- పరిశుభ్ర ఇంధనం, హరిత నౌకాయాన రంగాల్లో సహకారం



**ఓస్లో, 19 మే (మన ప్రజాగళం):** భారత్--నార్వే సంబంధాలు మరో కీలక మైలురాయిని చేరుకున్నాయి. నార్వే రాజధాని ఓస్లోలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో రెండు దేశాల మధ్య ఉన్న భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ముఖ్యంగా ఇరు దేశాల సంబంధాలను "గ్రీన్ వ్యూహాత్మక భాగస్వామ్యం"గా అభివృద్ధి చేయడం ఈ సమావేశంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రధాని మోదీ సామాజిక మాధ్యమ వేదికలో స్పందిస్తూ నార్వే ప్రధానితో జరిగిన చర్చలు ఎంతో ఫలవంతంగా సాగాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్ర ఇంధన వనరులు, స్థిరమైన అభివృద్ధి అంశాల్లో కలిసి పనిచేయడానికి ఇరు దేశాలు అంగీకరించినట్లు వెల్లడించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హరిత సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ గ్రీన్ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా పరిశుభ్ర ఇంధనం, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ, హరిత నౌకాయానం వంటి రంగాల్లో భారత్--నార్వే కలిసి ముందుకు సాగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, కాలుష్య సమస్యలు తీవ్రంగా మారుతున్న సమయంలో ఈ ఒప్పందం కీలకంగా మారింది. సముద్ర వనరుల వినియోగంలో పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి సాధించడంపై కూడా ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. అంతేకాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, విద్య, వైద్య

మిగతా 2 లో..

## టీవీకే ప్రభుత్వంపై స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

- ఎప్పుడైనా ప్రభుత్వం కూలిపోవచ్చని వ్యాఖ్య
- ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు పిలుపు
- సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండాలని సూచన



**తమిళనాడు, 19 మే (మన ప్రజాగళం): :** తమిళనాడులో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వం అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన స్టాలిన్, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పూర్తి స్థాయి బలంతో లేదని, ఎప్పుడైనా రాజకీయ పరిస్థితులు మారవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.
టీవీకే పార్టీ సొంతంగా నూట

మిగతా 2 లో..

## విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు.

9390 875876

## భారత్‌కు అమెరికా

# రక్షణ ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్

- నాలుగు వేల కోట్ల విలువైన రెండు కీలక ఒప్పందాలు
- అపాచీ, హోవిట్జర్ వ్యవస్థలకు అమెరికా అనుమతి
- భారత రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానున్న సూచనలు

**వాషింగ్టన్, 19 మే (మన ప్రజాగళం):** భారత్‌తో కీలక రక్షణ ఒప్పందాలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపినట్లు సమాచారం. సుమారు నాలుగు వేల కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన సైనిక ఒప్పందాలకు అనుమతి లభించినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ద్వారా భారతదేశం అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లకు సంబంధించిన సేవలు, అల్ట్రా లైట్ హోవిట్జర్ వ్యవస్థలకు మద్దతు పొందనుంది. ఈ ఒప్పందంలో భాగంగా అపాచీ హెలికాప్టర్ల సపోర్ట్ సేవల కోసం దాదాపు పందొమ్మిది కోట్ల ఎనభై లక్షల డాలర్లు ఖర్చు చేయనున్నారు. అలాగే అల్ట్రా లైట్ హోవిట్జర్ వ్యవస్థల నిర్వహణ, సేవల కోసం ఇరవై మూడు కోట్ల డాలర్లు కేటాయించనున్నారు. ఈ ఒప్పందాల ద్వారా భారత సైనిక సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని అమెరికా విదేశాంగ శాఖ



మిగతా 2 లో..

## దేశాన్ని కలవరపెడుతున్న అత్యాచారాలు

- మహిళల భద్రతపై పెరుగుతున్న ఆందోళన
- రోజురోజుకూ పెరుగుతున్న లైంగిక దాడుల ఘటనలు
- నగరాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా మహిళలపై దాడులు
- కఠిన చట్టాలు ఉన్నా తగ్గని నేరాలు

**డెస్క్, 19 మే ((మన ప్రజాగళం):** దేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల ఘటనలు మరోసారి ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్నారుల



మిగతా 2 లో..

## భారత్--నార్వే సంబంధాలకు
# కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి..)

సేవలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కూడా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సమావేశంలో చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల మార్పిడి ద్వారా యువతకు కొత్త అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. భవిష్యత్తులో విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాల మధ్య సంబంధాలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సమావేశంలో మరో ముఖ్య అంశం ఇండో--పసిఫిక్ మహాసముద్ర కార్యక్రమానికి నార్వే మద్దతు ప్రకటించడం. ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, సముద్ర వాణిజ్య మార్గాల రక్షణకు భారత్ చేపట్టిన కార్యక్రమంలో నార్వే భాగస్వామ్యం కావడం వ్యూహాత్మకంగా కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో పలు దేశాలు భాగస్వామ్యం కావడం వల్ల అంతర్జాతీయ సహకారం మరింత బలపడే అవకాశం ఉంది. ఇటీవలి కాలంలో భారత్ ప్రపంచ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా హరిత ఇంధనం, సాంకేతికత, సముద్ర భద్రత వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తోంది. నార్వేతో కుదిరిన తాజా వ్యూహాత్మక భాగస్వామ్యం భవిష్యత్‌లో ఇరు దేశాలకు ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ రంగాల్లో మరింత ప్రయోజనకరంగా మారే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# టీవీకే ప్రభుత్వంపై స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి..)

ఏడు స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోందని స్టాలిన్ పేర్కొన్నారు. కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ, ఇతర మిత్రపక్షాల మద్దతు ప్రస్తుతం ప్రభుత్వానికి కీలకమని వివరించారు. ఈ మద్దతులో మార్పులు చోటుచేసుకుంటే రాజకీయ అస్థిరత తలెత్తే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే తిరుగుబాటు చేసిన శాసనసభ్యులపై స్పీకర్ లేదా న్యాయస్థానాలు తీసుకునే నిర్ణయాలు కూడా పరిస్థితులను ప్రభావితం చేయవచ్చని తెలిపారు. రాజకీయ సమీకరణాల్లో చిన్న మార్పు కూడా రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గతంలో ఎన్నో ఎన్నికల ఓటముల తర్వాత కూడా డీఎంకే తిరిగి బలంగా పుంజుకుందని స్టాలిన్ గుర్తు చేశారు. ఈ ఓటమి శాశ్వతం కాదని, రాబోయే ఎన్నికల్లో పార్టీ తిరిగి విజయాన్ని అందుకుంటుందని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. తమిళనాడులో డీఎంకే గుర్తైన సూర్యుడు ఎప్పటికీ అస్తమించదని వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని స్టాలిన్ తెలిపారు. ఒకప్పుడు టీ దుకాణాల్లో జరిగే రాజకీయ చర్చలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్టీపై వచ్చే విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలని, కార్యకర్తలు డిజిటల్ వేదికల్లో మరింత చురుకుగా ఉండాలని సూచించారు.

## భారత్‌కు అమెరికా
# రక్షణ ఒప్పందాలకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి..)

అభిప్రాయపడింది. అపాచీ ప్యాకేజీ అమలులో బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. హోవిజ్జర్ వ్యవస్థల కోసం బీఏఈ సిస్టమ్స్ సాంకేతిక సహకారం అందించనుంది. రక్షణ రంగంలో ఈ సంస్థలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. అపాచీ హెలికాప్టర్ సేవలలో ఇంజినీరింగ్, సాంకేతిక మద్దతు, లాజిస్టిక్ సహకారం, నిర్వహణ సేవలు అందించనున్నారు. హోవిజ్జర్ వ్యవస్థల ఒప్పందంలో విడిభాగాలు, మరమ్మతు సేవలు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక మద్దతు కూడా ఉండనున్నాయి. దీంతో భారత సైన్యానికి మరింత సమర్థవంతమైన మద్దతు లభించే అవకాశం ఉంది. ఏహెచ్ అరవై నాలుగు అపాచీ హెలికాప్టర్లు ప్రపంచంలో అత్యాధునిక యుద్ధ హెలికాప్టర్లలో ఒకటిగా గుర్తింపు పొందాయి. వీటిలో అత్యాధునిక లక్ష్య గుర్తింపు వ్యవస్థలు, యాంటీ ట్యాంక్ క్షిపణులు, రాత్రి సమయంలో కూడా కార్యకలాపాలు నిర్వహించే ప్రత్యేక సెన్సార్లు ఉన్నాయి. వివిధ వాతావరణ పరిస్థితుల్లో కూడా ఇవి సమర్థంగా పనిచేస్తాయి. భారత సైన్యంలో ఇప్పటికే అపాచీ దళం కీలక పాత్ర పోషిస్తోంది. రాత్రి సమయాల్లో, క్లిష్ట పరిస్థితుల్లో కూడా మిషన్లను విజయవంతంగా పూర్తి చేసే సామర్థ్యం ఈ హెలికాప్టర్లకు ఉంది. తాజా ఒప్పందాలతో భారత రక్షణ వ్యవస్థ మరింత బలపడే అవకాశం ఉందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దేశాన్ని కలవరపెడుతున్న అత్యాచారాలు



(మొదటి పేజీ తరువాయి..)

నుంచి వృద్ధ మహిళల వరకు ఎవరూ మినహాయింపు కాదన్నట్టుగా చోటుచేసుకుంటున్న ఘటనలు సమాజాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలోని పుణేలో మహిళా న్యాయవాదిపై జరిగిన దారుణ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సంఘటనతో మహిళల భద్రత, చట్ట అమలు, సామాజిక పరిస్థితులపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా తరచూ వెలుగులోకి వస్తున్న లైంగిక దాడుల కేసులు మహిళల్లో భయాందోళనలు పెంచుతున్నాయి. పబ్లిక్ ప్రదేశాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రాంతాలు, ప్రయాణ సమయాలు కూడా పూర్తిగా సురక్షితంగా ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ పరిచయాలు, సామాజిక మాధ్యమాల వేదికలు కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం పలు కఠిన చట్టాలు తీసుకొచ్చినా, నేరాల సంఖ్య తగ్గడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితులకు వేగంగా శిక్షలు పడకపోవడం, విచారణలు ఆలస్యం కావడం కూడా ఆందోళనకు కారణంగా మారుతున్నాయి. చట్టం పట్ల భయం తగ్గిపోతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమాజంలో మహిళల పట్ల గౌరవం, అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సామాజికవేత్తలు చెబుతున్నారు. కుటుంబ స్థాయి నుంచే పిల్లల్లో విలువలు, బాధ్యత, మహిళల పట్ల గౌరవం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత కూడా సమానంగా అవసరమని పేర్కొంటున్నారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, అది సమాజం మొత్తం బాధ్యత అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అత్యవసర సహాయక వ్యవస్థలు, పర్యవేక్షణ వ్యవస్థలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలు భయపడకుండా జీవించే వాతావరణం కల్పించడం ప్రతి ప్రభుత్వానికి, ప్రతి పౌరుడికి బాధ్యతగా మారింది. దేశంలో పెరుగుతున్న లైంగిక దాడుల ఘటనలు కేవలం నేర గణాంకాలు కాదు, సమాజానికి ఒక హెచ్చరికగా మారుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్లాస్టిక్ ముప్పు

డెస్క్, మే 19

ఒకప్పుడు ప్లాస్టిక్‌ను ఆధునిక జీవనానికి వరంగా భావించారు. తక్కువ ధర, తేలికగా మోసుకెళ్లే సౌలభ్యం, ఎక్కువకాలం మన్నే లక్షణాలు దీనిని ప్రతి ఇంటిలోకి తీసుకొచ్చాయి. ఇంటి సామగ్రి నుంచి ఆహార ప్యాకెట్లు, వైద్య పరికరాల నుంచి వ్యవసాయ రంగం వరకు ప్రతి చోట ప్లాస్టిక్ విస్తరించింది. కానీ ఒకప్పుడు సౌకర్యానికి చిహ్నంగా కనిపించిన అదే ప్లాస్టిక్ ఇప్పుడు భూమికి పెరుగుతున్న భారంగా మారింది. మనం కొన్ని నిమిషాలు మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు ప్రకృతిలో వందల సంవత్సరాలు అలాగే ఉండిపోతున్నాయి. ఇటీవల వెలువడిన అంతర్జాతీయ నివేదికలు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జలవనరుల్లోకి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థపై ఇది నిశ్శబ్ద సంక్షోభంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ సమస్య కేవలం చెత్త నిర్వహణ సమస్యగా మిగలలేదు. సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు కొత్త ప్రమాదంగా మారాయి. పెద్ద ప్లాస్టిక్ వస్తువులు కాలక్రమేణా చిన్న కణాలుగా విడిపోయి గాలి, నీరు, నేలలో కలిసిపోతున్నాయి. తాజా పరిశోధనల్లో నగర గాలిలో కూడా సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారంలో కూడా ఇవి చేరుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మనిషి శరీరంలోకి ఈ కణాలు చేరడం ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి.
సముద్రాలు కూడా ప్లాస్టిక్ కాలుష్యానికి భారీ కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రపంచ సముద్రాల్లో లక్షల కోట్ల సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు తేలుతున్నాయని అంచనాలు చెబుతున్నాయి. చిన్న చేపలు వాటిని ఆహారంగా భావించి మింగుతున్నాయి. తరువాత పెద్ద చేపలు చిన్న చేపలను తినడం ద్వారా ఈ కాలుష్యం మొత్తం ఆహార గొలుసులోకి ప్రవేశిస్తోంది.

# పెండింగ్ బిల్లుల చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి..)




భూసేకరణ పరిస్థితులు, నిధుల విడుదల వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ నిధుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. భూములు కోల్పోయిన రైతులు, బాధితులకు సరైన సమయంలో పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలు నిధుల కొరతతో నిలిచిపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పనులు ఆగిపోకుండా అవసరమైన నిధులను విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం సహించబోమని సంబంధిత అధికారులకు హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు రైతుల భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారే అవకాశముందని భావిస్తున్నారు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది.

# పారిశుధ్యంపై జాతీయ సమీక్ష




(మొదటి పేజీ తరువాయి..)

చర్చించారు. సమావేశంలో పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలు తీరు, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలపై సమీక్ష నిర్వహించారు. చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసే విధానాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. శాస్త్రీయ విధానాలతో వ్యర్థాల ప్రాసెసింగ్ చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సఫాయిమిత్రల భద్రత, గౌరవానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. పారిశుధ్య కార్మికుల పని పరిస్థితులు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వారి సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. పట్టణాల పరిశుభ్రతలో సాంకేతికత వినియోగం, వ్యర్థాల నిర్వహణలో ఆధునిక పద్ధతులపై కూడా చర్చించారు. నగరాల్లో శాశ్వత పరిశుభ్రత సాధనకు సమగ్ర కార్యాచరణ అవసరమని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. స్వచ్ఛ భారత్ కార్యక్రమం లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు రాష్ట్రాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. పారిశుధ్య వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.

# భగీరథ్ కేసులో సిట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి..)

న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత ప్రచారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం పనిచేయనుంది. న్యాయవ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా జరిగిన సోషల్ మీడియా ప్రచారం వెనుక ఉన్న అసలు వ్యక్తులు, దానికి సంబంధించిన వ్యవస్థలను గుర్తించడంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.
బండి భగీరథ్‌కు సంబంధించిన ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టులో విచారణకు వచ్చిన సమయంలో కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని పోస్టులు ప్రచారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పోస్టుల్లో తీవ్ర ఆరోపణలు, అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారం న్యాయవర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. విచారణ ప్రారంభంలోనే న్యాయమూర్తి తనపై జరుగుతున్న ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. న్యాయపరమైన విధులు నిర్వహించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ప్రచారం జరగడం ఆందోళనకరమని న్యాయవర్గాలు అభిప్రాయపడ్డాయి. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం కూడా ఈ అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.
ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న దామోదర్‌ను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఈ ప్రచారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికల్లో ఈ ప్రచారం ఎలా విస్తరించిందనే అంశంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పుడు ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, ఏ ఐటీ వ్యవస్థలు లేదా ఖాతాల ద్వారా ఈ ప్రచారం విస్తరించిందనే కోణంలో లోతైన విచారణ ప్రారంభించింది. ఈ కేసు విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## తెలంగాణలో బీజేపీయే ప్రత్యామ్నాయమన్న రాంచందర్ రావు

(మొదటి పేజీ తరువాయి..)




ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని రాంచందర్ రావు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని, బీజేపీపై ఆశలు పెంచుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ కీలక శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో తన ఉనికిని కోల్పోయిందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు భారతీయ జనతా పార్టీలో చేరేందుకు సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడించారు. రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో బీజేపీ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలపై ఇతర పార్టీల నుంచి స్పందన రావాల్సి ఉంది. ఈ సమావేశంలో ప్రధాని ఇచ్చిన "మేరా భారత్, మేరా యోగ్‌దాన్" పిలుపును కూడా ప్రస్తావించారు. ఈ జాతీయ కార్యక్రమంలో కార్యకర్తలంతా పూర్తి అంకితభావంతో పాల్గొనాలని సూచించారు. సమాజ సేవ, దేశాభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చురుకుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు, మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోయే రాజకీయ పరిణామాలు, సంస్థాగత బలోపేతంపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. తెలంగాణలో పార్టీ విస్తరణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# రైతులకు సహకరించండి

**రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి**

**డాటా ఎంట్రీ, ట్రక్ షీట్ జనరేషన్‌లో నిర్లక్ష్యం సహించము : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రతినిధి,మన ప్రజాగళం..**

రైతులు తీసుకువచ్చిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసి, నిర్ణీత సమయంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, ఏపీఎంలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కొనుగోలు కేంద్రాల్లో డాటా ఎంట్రీ మరియు ట్రక్ షీట్ జనరేషన్ ప్రక్రియలో ఎలాంటి తేడాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. 24 గంటల్లోగా పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.కొన్ని రైస్ మిల్లుల వద్ద లారీలు నిలిచిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే లారీలను ఫ్రీ చేసి ధాన్యాన్ని అన్లోడ్ చేయించాలని ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద లారీలు ఎక్కువసేపు ఆగకుండా తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.కొంతమంది మిల్లర్లు సహకరించడం లేదని సమాచారం ఉందని, ప్రతి రైస్ మిల్లులో ఎంత ధాన్యం అన్లోడ్ చేశారన్న వివరాలను సేకరించి, నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మిల్లుల వద్ద పోలీసు అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం రవాణా, అన్లోడింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు.ప్రతిరోజూ మండలాల వారీగా, మిల్లర్ల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్ వివరాలను తయారు చేసి పర్యవేక్షించాలని సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 5,32,655 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 5,573 మంది రైతుల ఖాతాల్లో రూ.89.85 కోట్లు జమ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ తెలిపారు. ఇప్పటివరకు 3,520 టార్పాలిన్ కవర్లు సరఫరా చేసినట్లు మార్కెటింగ్ డీఎం శ్రీకాంత్ తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.




## భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో
# జనగామ జిల్లా రాష్ట్ర స్థాయి లో ముందంజ

**ఉమ్మడి వరంగల్ స్థాయి లో జనగాం లో వేగం గా భూ భారతి దరఖాస్తుల పరిష్కారం**

**తహసీల్దార్ లకు కలెక్టర్ అభినందన.**

**ఇదే స్ఫూర్తితో మరింత వేగం పెంచాలి.**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బచ్చన్నపేట మే 18 మన ప్రజా గళం**

ప్రతి మంగళవారం భూ భారతి దరఖాస్తులను పరిష్కరించే అంశంపై జరిగే సమీక్ష సమావేశాల సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈరోజు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించడంలో తహసీల్దార్లు, వారి సిబ్బంది విస్తృతంగా కృషిచేయడం వల్ల రాష్ట్ర స్థాయిలో జిల్లా ముందంజలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తహసీల్దార్లను అభినందించారు.అనంతరం ఆయా మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు.భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ కే .గోపీరాం, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



## దళిత వర్గాలకే కాంగ్రెస్ పార్టీ మండల
# అధ్యక్ష పదవి కేటాయించాలి

**దళిత కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్**

**బచ్చన్నపేట మే 17 మన ప్రజాగళం**

బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ దళిత ముఖ్య నాయకుల సమావేశని నిర్వహించారు,సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని దళితులకే కేటాయించాలని జనగామ డిసిసి అధ్యక్షురాలు లక్కవత్ ధనవంతి, జిల్లా ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రితంల ను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందించారు బచ్చన్నపేట మండలంలోనే దళిత్ ల జనాభా నిష్పత్తి ప్రకారం మండల అధ్యక్ష పదవిని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దళితులు అహర్నిశలు కృషి చేస్తారని దళితులను పనులకే వాడుకోవడం తప్ప పదవులు ఇచ్చిన పాపన పోలేదని దళితులకు కాంగ్రెస్ పార్టీ పదవులు ఇచ్చి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమటికేశపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకులు కళ్లెం రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంధారం క్రాంతి కుమార్, బచ్చన్నపేట టౌన్ ప్రధాన కార్యదర్శి కర్రె నరేష్, సీనియర్ నాయకులు అల్వాల్ రమేష్, మొద్దు బాల భాస్కర్, పాకాల చిరంజీవి, నర్సింగ ఎల్లేష్, బెజగం నరేష్, అల్వాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 20న జాబ్ మేళా



**సంగారెడ్డి ప్రతినిధి,మన ప్రజాగళం..**

సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువత జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20వ తేదీన ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని వెలుగు ఆఫీస్ సమీపంలో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కు చెందిన లైఫ్ మిత్ర పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ ద్వారా ఆకర్షణీయమైన కమిషన్ ఆధారిత వేతనం అందజేయనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలు మరియు ఆధార్ కార్డు ప్రతులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఫోన్ నంబర్ 08455-271010 ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎండలు మండుతున్నాయి ప్రజలు జాగ్రత్త ఉండాలి

**కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ సూచన.**

**మధ్యాహ్నం వేళ ఇళ్ల నుంచి బయటకు రావద్దు**

**అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి.**



**కొమరవెల్లి మే 18 మన ప్రజా గళం**

జిల్లాలో ఎండలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ సూచించారు.ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, ఆ సమయంలో అవసరం లేకుండా బయటకు రావద్దని తెలిపారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో 108 ఉచిత అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైతే వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.ఎండలో వెళ్లేవారు తప్పనిసరిగా గొడుగు, టోపీ ధరించి, వెంట నీళ్ల బాటిల్ తీసుకెళ్లాలన్నారు.ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించడం అవసరమని మహాదేవుని శ్రీనివాస్ సూచించారు.

# దళిత వర్గాలకే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి కేటాయించాలి

**దళిత కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్**



**బచ్చన్నపేట మే 18 మన ప్రజాగళం**

బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ దళిత ముఖ్య నాయకుల సమావేశని నిర్వహించారు,సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని దళితులకే కేటాయించాలని జనగామ డిసిసి అధ్యక్షురాలు లక్కవత్ ధనవంతి, జిల్లా ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రితంల ను కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు సానుకూలంగా స్పందించారు బచ్చన్నపేట మండలంలోనే దళిత్ ల జనాభా నిష్పత్తి ప్రకారం మండల అధ్యక్ష పదవిని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దళితులు అహర్నిశలు కృషి చేస్తారని దళితులను పనులకే వాడుకోవడం తప్ప పదవులు ఇచ్చిన పాపన పోలేదని దళితులకు కాంగ్రెస్ పార్టీ పదవులు ఇచ్చి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పడమటికేశపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకులు కళ్లెం రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంధారం క్రాంతి కుమార్, బచ్చన్నపేట టౌన్ ప్రధాన కార్యదర్శి కర్రె నరేష్, సీనియర్ నాయకులు అల్వాల్ రమేష్, మొద్దు బాల భాస్కర్, పాకాల చిరంజీవి, నర్సింగ ఎల్లేష్, బెజగం నరేష్, అల్వాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీవోను సన్మానించిన బిఆర్ఎస్ సర్పంచులు

**బచ్చన్నపేట మే 18 మన ప్రజా గళం**

మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన లావణ్య ను సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎండి పిరోజ్ మండల బిఆర్ఎస్ సర్పంచ్‌లతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకు శాలువా కప్పి, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి, పెండింగ్ పనులు, మరియు స్థానిక సమస్యలపై ఎంపీడీవోతో సర్పంచ్‌లు చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో సహకరించాలని వారు కోరారు.రాజకీయాలకు అతీతంగా మండల ప్రగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో సర్పంచ్‌లకు హామీ ఇచ్చారు. పలు గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



# హనుమాన్ విగ్రహం ధ్వంసం కలకలం

- న్యూ శాయంపేటలో ఘటనతో ఉద్రిక్తత
- రోడ్డుపై భక్తుల ధర్నాతో ట్రాఫిక్ స్తంభనం
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హన్మకొండ, 19 మే మన ప్రజాగళం:**
హన్మకొండ జిల్లాలోని న్యూ శాయంపేట సర్కిల్ పరిధిలో హనుమాన్ స్వామి విగ్రహం ధ్వంసమైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసం ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన హనుమాన్ భక్తులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో న్యూ శాయంపేట ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని కోరారు. సమాచారం అందుకున్న బజరంగదళ్ కార్యకర్తలు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటున్నారు. ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘటనతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# డబుల్ ఇళ్లపై సమీక్ష

- అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే



**హైదరాబాద్, 19 మే మన ప్రజాగళం..**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి, దేవేందర్ నగర్ ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతుల పరిస్థితిని సమావేశంలో సమీక్షించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యలపై అధికారులు, లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కెపి వివేకానంద్, మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న లబ్ధిదారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగనున్నట్లు సమాచారం.

# ఓటరు జాబితాలపై కీలక సమావేశం

- ప్రత్యేక సవరణ షెడ్యూల్‌పై రాజకీయ పార్టీలతో చర్చ
- ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదుపై వివరాలు
- పారదర్శక ఓటరు జాబితాలకు సహకరించాలని పిలుపు

**జగిత్యాల, 19 మే మన ప్రజాగళం..**
జిల్లాలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు వేల ఇరవై ఆరు అక్టోబర్ ఒకటో తేదీని అర్హత తేదీగా పరిగణించి ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ పదిహేనో తేదీ నుంచి ఇరవై నాలుగో తేదీ వరకు ఓటరు జాబితా తయారీ, సిబ్బంది శిక్షణ, ముద్రణ ప్రక్రియలు చేపడతారని వివరించారు.జూన్ ఇరవై ఐదో తేదీ నుంచి జూలై ఇరవై నాలుగో తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలు ఈ సమయంలో చేపడతారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మార్పులపై కూడా ప్రతిపాదనలు స్వీకరిస్తామని తెలిపారు. జూలై ముప్పై ఒకటో తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత ఆగస్టు ముప్పై వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరిస్తామని కలెక్టర్ వివరించారు. అందిన అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ ఒకటో తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.పారదర్శకంగా, లోపరహితంగా ఓటరు జాబితాల తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ అంశాల్లో ప్రజలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయగా వాటిని నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



# జొన్నల కొనుగోళ్లపై సమీక్ష



**ఆదిలాబాద్, 19 మే మన ప్రజాగళం..**
జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, నిల్వలు, రవాణా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఎక్కువకాలం నిల్వ ఉంచకుండా త్వరగా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్, కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంట కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రైతులకు పారదర్శక సేవలు అందించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.రైతులకు కనీస మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి రైతులకు సమయానికి మద్దతు అందించడం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# యువతకు కలెక్టర్ పిలుపు

- నైపుణ్యాలతో ఏ రంగంలోనైనా రాణించొచ్చని సూచన

**గద్వాల, 19 మే (మన ప్రజాగళం..**
యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక తొంభై తొమ్మిది రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వీక్ వేడుకల్లో భాగంగా గద్వాల ఏటీసీ కేంద్రంలో విద్యార్థులకు కెరీర్, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏటీసీ కేంద్రంలో అత్యాధునిక పరికరాలతో అందిస్తున్న శిక్షణ యువతలో సృజనాత్మకతను పెంపొందిస్తుందని అన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. యువత తమ ఆసక్తులకు అనుగుణంగా శిక్షణ పొందాలని సూచించారు. పరిశ్రమలు, ఎస్సీ సంక్షేమం, మత్స్యశాఖ, బ్యాంకింగ్ వంటి రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పీఎం ఈజీపీ, ముద్ర, విశ్వకర్మ వంటి పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలు ప్రారంభించవచ్చని చెప్పారు. యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి అవకాశాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మంచి సంభాషణ నైపుణ్యాలు ఉంటే వేదికపై మాట్లాడటంలో భయం తగ్గుతుందని, ఉద్యోగ ఇంటర్వ్యూల్లో ధైర్యంగా సమాధానాలు చెప్పవచ్చని అన్నారు. హిందీ, ఆంగ్ల భాషలతో పాటు ఇతర భాషలు నేర్చుకోవడం ద్వారా దేశ విదేశాల్లో అవకాశాలు పొందవచ్చని వివరించారు. జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషలు నేర్చుకునేందుకు ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికల్లో అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సొంత ప్రాంతాల్లో అవకాశాలు లేకపోయినా ఇతర ప్రాంతాలకు వెళ్లి తమ ప్రతిభను చాటేందుకు యువత సిద్ధంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, నైపుణ్యాలే భవిష్యత్తుకు బలమైన పునాదులు అని చెప్పారు.ఈ కార్యక్రమం అనంతరం అలంపూర్ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన పర్యాటక శాఖ బ్రోచర్లను కలెక్టర్ విడుదల చేశారు. అలాగే ఏటీసీలో విద్యార్థులకు శిక్షణ అందించేందుకు వినియోగిస్తున్న యంత్ర పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం

- ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దన్న కలెక్టర్
- అర్జీదారుల సమస్యలను స్వయంగా విన్న ఖుష్బూ గుప్తా
- త్వరిత చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**మహబూబ్‌నగర్, 19 మే మన ప్రజాగళం..**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలను ఓపికగా విని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని పేర్కొన్నారు.ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్న సమస్యైనా, పెద్ద సమస్యైనా నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తూ వాటి పరిష్కార ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. ప్రజల సమస్యలపై అధికారులు మానవతా దృక్పథంతో స్పందించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తోందని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశంగా దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మరోసారి స్పష్టం చేశారు.



# ప్రయాణంలోనే కారుకు మంటలు.. తృటిలో తప్పిన ప్రమాదం

**అదిలాబాద్, 19 మే మన ప్రజాగళం..**
అదిలాబాద్ జిల్లాలో భారీ ప్రమాదం తృటిలో తప్పింది. ఇచ్చోడ మండల పరిధిలోని రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు ఒక్కసారిగా అగ్నికి ఆహుతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. అదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణం మధ్యలోనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం ప్రకారం, ప్రయాణంలో ఉన్న సమయంలో కారులో నుంచి ఒక్కసారిగా పొగలు రావడం ప్రారంభమైంది. కొద్ది సేపటికే మంటలు వేగంగా వ్యాపించాయి. పరిస్థితిని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై కారులో ఉన్న ప్రయాణికులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నించారు. సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది.స్థానికులు చాకచక్యంగా వ్యవహరించడంతో కారులో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు. కొన్ని క్షణాలు ఆలస్యమై ఉంటే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఘటన జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులు బయటకు వచ్చిన కొద్దిసేపటికే మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. దీంతో కారు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. వాహనం నుంచి ఎగిసిపడిన మంటలు, పొగలు దూరం నుంచే కనిపించడంతో రహదారిపై కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# వరి ధాన్యం కొనుగోళ్ల వేగవంతంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- కొనుగోలు కేంద్రాల పనితీరుపై ప్రత్యేక దృష్టి
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తక్షణ తూకం, రవాణా, చెల్లింపులపై ఆదేశాలు



**బీర్పూర్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణను వేగవంతం చేయాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం బీర్పూర్ మండలంలోని చర్లపల్లి, నరసింహులపల్లి, కందెనకుంట, తుంగూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రాల పనితీరు, రైతులకు అందుతున్న సేవలు, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎక్కువసేపు నిరీక్షించే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్‌లోడింగ్ అయ్యేలా సమన్వయం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి ధాన్యం వర్షం, ఇతర పరిస్థితుల వల్ల పాడవకుండా రక్షించాలని అధికారులకు సూచించారు. రైతుల కష్టానికి తగిన విలువ దక్కేలా ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా సరఫరా అధికారి జితేందర్ రెడ్డి, తహసీల్దార్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల కోసం 'ప్రణామ్' డే కేర్ సెంటర్ ప్రారంభం

- వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ ప్రత్యేక చర్యలు
- వయోవృద్ధుల అనుభవాలు యువతకు మార్గదర్శకం
- సీనియర్ సిటిజన్ల కోసం పలు సౌకర్యాల ఏర్పాటు

**జనగామ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ప్రణామ్' మల్టీ సర్వీస్ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ సౌజన్యంతో, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వయోవృద్ధుల ఆదరణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ చర్యలు అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఈ డే కేర్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవాలు, జ్ఞానం యువతరం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డే కేర్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులను కలెక్టర్ అభినందించారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కేంద్రంలో వారికి సమయాన్ని ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో వయోవృద్ధులు చదువుకునేందుకు వార్తాపత్రికలు, వార్తలు వీక్షించేందుకు టెలివిజన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలతో పాటు సామాజికంగా కలిసిమెలిసి ఉండేందుకు అనువైన వాతావరణం కల్పించినట్లు వెల్లడించారు. నూతన భవనంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని సౌకర్యాల కోసం తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వయోవృద్ధులు



సద్వినియోగం చేసుకుని ఆనందంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ డి. లవకుమార్ రెడ్డి డే కేర్ సెంటర్ పని విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ సంఘాల నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు
- పెండింగ్ లేకుండా అర్జీల పరిష్కారానికి ఆదేశాలు
- సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

**జనగామ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించి పరిశీలించారు ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన అర్జీలను కలెక్టర్ నేరుగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు కేటాయించారు. ప్రజా సమస్యలను సకాలంలో గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి వేగంగా స్పందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజల్లో ప్రభుత్వ సేవలపై విశ్వాసం పెంచేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి వ్యవస్థ ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే ముఖ్య వేదికగా పనిచేస్తోందని, అందువల్ల అధికారులు ప్రజల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రంగారావు, జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రణాళికాధికారి చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# వరదల సన్నద్ధతపై కలెక్టర్ పరిశీలన

**ములుగు, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** రాబోయే వర్షాకాలంలో సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ములుగు జిల్లా బండారుపల్లి రాళ్లవాగు వద్ద నిర్వహించిన నమూనా కసరత్తును జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. విపత్తు సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యల పనితీరును క్షుణ్ణంగా గమనిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే జిల్లాలోని విపత్తు నిర్వహణ వ్యవస్థను సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆకస్మిక వరదలు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అధికారులు, సహాయక బృందాలు ఎలా స్పందించాలి అనే అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా సాధన చేపట్టారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడం, ప్రమాద ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర సేవలను వేగంగా అందించడం వంటి పరిస్థితులను ప్రదర్శించారు. సహాయక బృందాల స్పందన సమయం, సమన్వయ సామర్థ్యాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సమయానుకూల స్పందన అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సహాయక సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించడం, ప్రమాద పరిస్థితుల్లో వెంటనే స్పందించడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఎస్‌డీఆర్‌ఎఫ్ పర్యవేక్షకులు, ఐదో బెటాలియన్ డీఎస్పీ, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్, ఆర్డీఓ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. విపత్తు నిర్వహణలో ముందస్తు సిద్ధత, శాఖల సమన్వయం కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు.

# జనగణన పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- నెమ్మదిగా సాగుతున్న ప్రక్రియపై అసంతృప్తి
- పనితీరు లేని సిబ్బందిపై చర్యలకు ఆదేశం
- ఫీల్డ్ సిబ్బందికి తాగునీరు, ఓఆర్ఎస్ అందించాలని సూచన



**హైదరాబాద్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనగణన నమోదు ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగోల్‌లోని జైపురి కాలనీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఫీల్డ్ స్థాయిలో బాధ్యత, పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో డిప్యూటీ కమిషనర్, జనగణన సమన్వయ అధికారి, అదనపు మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు. జనగణన ప్రక్రియ పురోగతిని పరిశీలించిన కమిషనర్ నెమ్మదిగా సాగుతున్న పనితీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్యాలకు అనుగుణంగా పని పురోగతి కనిపించకపోవడంతో సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. పనితీరు సరిగా లేని ఎన్యూమరేటర్లను గుర్తించి వారిని వెంటనే మార్చాలని ఆదేశించారు. ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు. జనగణన కార్యక్రమం సమయపాలనతో పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించే సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎలాంటి ఆలస్యం లేకుండా లక్ష్యాలను పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఫీల్డ్ సిబ్బంది ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విధుల్లో ఉన్న పర్యవేక్షకులు, ఎన్యూమరేటర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. జనగణన ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బంది ఆరోగ్యం, పని సామర్థ్యం కూడా సమానంగా ముఖ్యమని కమిషనర్ తెలిపారు. ప్రజల సహకారంతో జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

# దివ్యాంగుల సమస్యపై కలెక్టర్ తక్షణ స్పందన

- ఇద్దరికి బ్యాటరీ ట్రైసైకిళ్ల అందజేత
- ఐడీఓసీకి వచ్చిన బాధితులకు వెంటనే సహాయం
- కలెక్టర్ స్పందనపై కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగులు



**రాజన్న సిరిసిల్ల, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అధికార పనుల కోసం ఐడీఓసీకి వచ్చిన ఇద్దరు దివ్యాంగుల పరిస్థితిని స్వయంగా గమనించిన కలెక్టర్ వారికి తక్షణ సహాయం అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరె పరశురాములు సోమవారం అధికార పనుల నిమిత్తం ఐడీఓసీకి వచ్చారు. అక్కడ వారిని గమనించిన కలెక్టర్ గరిమా అగ్రవాల్ స్వయంగా వారితో మాట్లాడి వారి పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. సంభాషణలో భాగంగా బయటకు వెళ్లడం, రోజువారీ పనులు నిర్వహించడం చాలా కష్టంగా మారిందని వారు కలెక్టర్‌కు వివరించారు. ప్రయాణ సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడంతో కలెక్టర్ వెంటనే స్పందించారు. వారి సమస్య తీవ్రతను గుర్తించిన కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను వెంటనే ఆదేశించి ఇద్దరికీ బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు అందించాలని సూచించారు. అధికార యంత్రాంగం కూడా వెంటనే స్పందించి అవసరమైన ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇద్దరు లబ్ధిదారులకు బ్యాటరీ ట్రైసైకిళ్లతో పాటు భద్రత కోసం హెల్మెట్లు కూడా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగులతో మాట్లాడి వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తమ సమస్యను అర్థం చేసుకుని వెంటనే సహాయం అందించిన కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వంతో స్పందించి తమ జీవితాల్లో వెలుగు నింపారని ఆనందం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించిన ఆశాలు




**నాగర్‌కర్నూల్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు స్థిర వేతనంగా పద్దెనిమిది వేల రూపాయలు అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని కార్యకర్తలు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తుంటే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను వినిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఆశా కార్యకర్తలు ప్రతి నెలా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి రావాల్సిన పారితోషకాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల నెలా జీతాలు సకాలంలో చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రతి నెల ఐదో తేదీలోపు పారితోషకాలు జమ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా మూడు నుంచి నాలుగు నెలల వరకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని ఆశా కార్యకర్తలు తెలిపారు. వేతనాలు పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో క్యాంపు కార్యాలయ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా యూనియన్ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రజాపాలనలో భాగంగా ఐదు కే మారథాన్

- జెండా ఊపి ప్రారంభించిన ముఖ్య అతిథులు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత, ఉద్యోగులు
- విజేతలకు పతకాలు, ప్రశంస పత్రాల అందజేత

**ఆదిలాబాద్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్‌లో సోమవారం ఐదు కిలోమీటర్ల మారథాన్ పరుగును ఘనంగా నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మారథాన్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమై కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంది. నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగిన ఈ రన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, యువత, వివిధ వర్గాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సాహంగా పాల్గొన్న యువత మారథాన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మార్గమధ్యంలో పలువురు ప్రజలు పాల్గొన్న వారికి ప్రోత్సాహం అందించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు సూచించారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారికి కార్యక్రమం అనంతరం పతకాలు, ప్రశంస పత్రాలను ముఖ్య అతిథులు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన యువతను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడాధికారి జక్కుల శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ రవీందర్, ఇతర శాఖల అధికారులు, క్రీడ కోచ్‌లు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, యువత, ఉద్యోగులు పాల్గొన్నారు.




# రెడ్ క్రాస్ సభ్యత్వ విస్తరణకు శ్రీకారం

- కొత్త సభ్యుల నమోదు కార్యక్రమం ప్రారంభం
- సేవా కార్యక్రమాల విస్తరణకు పిలుపు
- సభ్యుల సంఖ్య పెరగాలని కలెక్టర్ సూచన

**జనగామ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** సమాజంలోని అవసరార్థులకు మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ అధ్యక్షుడు సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. సోమవారం జనగామ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సభ్యుల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా రక్త అవసరాలు, అత్యవసర పరిస్థితులు, సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సేవలను మరింత విస్తరించాలంటే సభ్యుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. సేవాభావం కలిగిన ప్రతి వయోజన మహిళ, పురుషుడు రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన నేపథ్యంలో రెడ్ క్రాస్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ మంది సభ్యులు ఉంటే మరింత విస్తృత స్థాయిలో సేవలు అందించవచ్చని వివరించారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుందని కలెక్టర్ తెలిపారు. జూన్ పదిహేనవ తేదీ లోగా సభ్యత్వం పొందిన వారికి ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. సభ్యత్వం పొందాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ బెన్షాలోం మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రముఖులు కూడా రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సమాజ సేవలో భాగస్వాములు కావడం ద్వారా అవసరార్థులకు మరింత సహాయం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ లవకుమార్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున రావు, కార్యదర్శి కన్నా పరశు రాములు, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. సభ్యత్వ దరఖాస్తు ఫారాలు సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.




# జిల్లా టాపర్ విద్యార్థులకు ఎమ్మెల్యే సన్మానం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు
- లక్ష్మీనారాయణ, శైలజలకు శుభాకాంక్షలు
- ఉపాధ్యాయుల సేవలను కొనియాడిన ఎమ్మెల్యే



**మేడ్చల్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మేడ్చల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచిన భౌరంపేట్ విద్యార్థి లక్ష్మీనారాయణను ఎమ్మెల్యే కేపీ వివేకానంద అభినందించారు. అలాగే దుండిగల్ మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన గాగిల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని శైలజను కూడా ప్రత్యేకంగా సన్మానించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన లక్ష్మీనారాయణ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించగా, గాగిల్లాపూర్ విద్యార్థిని శైలజ మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జిల్లా టాపర్‌గా నిలవడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కష్టపడి చదివి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో తల్లిదండ్రులకు, పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులను ఈ స్థాయికి తీసుకురావడంలో కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, భిక్షపతి గౌడ్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, కృషి వల్లే విద్యార్థులు విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాచారం మురళీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.



# జనగణన ప్రక్రియపై అధికారుల సమీక్ష

- హౌస్ లిస్టింగ్ పనుల పురోగతి పరిశీలన
- ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశం
- గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచన

**వరంగల్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఖాజీపేట పరిధిలోని నక్కలగుట్ట, వరంగల్‌లోని కాశిబుగ్గ జీడబ్ల్యూఎంసీ సర్కిల్ కార్యాలయాలను సందర్శించి జనగణన--2027 హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పురోగతిని అధికారులు సమీక్షించారు. ఇంటింటి వివరాల సేకరణ, డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హౌస్ లిస్టింగ్ కార్యక్రమంలో నమోదు అవుతున్న వివరాలను పరిశీలించారు. డేటా ఎంట్రీ పురోగతి, సిబ్బంది పనితీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. జనగణన ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ప్రతి ఇంటి వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్ ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ఈ గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సమగ్రంగా నమోదు చేసి, డేటా నమోదు సమయంలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే జనగణన కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు. పనుల పురోగతిపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనగణన కార్యక్రమం సక్రమంగా పూర్తయ్యేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

# ధాన్యం, జనగణనపై కలెక్టర్ సమీక్ష

- కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశం
- ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలని సూచన
- జనగణన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం

**జగిత్యాల, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, ధాన్యం తరలింపు ప్రక్రియతో పాటు జనగణన నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు విక్రయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువకాలం నిల్వ ఉండకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల పనితీరును అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. రవాణా ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ట్రాన్స్‌పోర్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వ, తరలింపు అంశాల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అనంతరం జనగణన నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బంది, శిక్షణ, ఫీల్డ్ స్థాయి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితమైన సమాచార సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పర్యాటక కోర్సుల పోస్టర్ల ఆవిష్కరణ

- యువ టూరిజం క్లబ్‌లకు ప్రోత్సాహం
- హెరిటేజ్ కోర్సులపై అవగాహన కార్యక్రమం
- విజేతలకు పుస్తకాలు అందజేసిన అధికారులు







**ఆదిలాబాద్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్‌లు, హెరిటేజ్ విభాగానికి సంబంధించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల పోస్టర్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంపై యువతలో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని అధికారులు తెలిపారు. పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ ప్రత్యేక కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, మైనారిటీ సంక్షేమ అధికారి కలీం, భూభారతి కోఆర్డినేటర్ స్వాగత్ తదితరులు పాల్గొన్నారు. యువత పర్యాటక రంగంపై ఆసక్తి పెంచుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు విలువైన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు పర్యాటక, వారసత్వ అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలంగాణలోని చారిత్రక, సాంస్కృతిక సంపదను తెలుసుకోవడం ద్వారా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సోనియా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# హెల్త్

## థైరాయిడ్ సమస్యలలో ఆహార నియమాలు కీలకం

- థైరాయిడ్ అంటే ఏమిటి?
- తీసుకోవాల్సిన ఆహారాలు
- దూరంగా ఉండాల్సిన పదార్థాలు

మన శరీరంలోని మెటాబాలిజం వ్యవస్థను నియంత్రించే ముఖ్యమైన గ్రంథి థైరాయిడ్. ఈ గ్రంథి సరిగా పనిచేయకపోతే బరువు పెరగడం, అలసట, జుట్టు రాలడం, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు సరైన ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.థైరాయిడ్ ఉన్నవారు అయోడిన్, సెలీనియం, జింక్, విటమిన్ డి లాంటి పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.




గుడ్లు, చేపలు, పాలు, పెరుగు, వేరుశెనగలు, గుమ్మడి గింజలు, బాదం వంటి పదార్థాలు థైరాయిడ్ గ్రంథి పనితీరుకు మేలు చేస్తాయి. బ్రోకోలీ, క్యారెట్, బీట్‌రూట్, పాలకూర వంటి కూరగాయలు కూడా శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. హైపోథైరాయిడ్ ఉన్నవారు ఉదయం ఖాళీ కడుపుతో మందు తీసుకున్న తర్వాత కనీసం అరగంట తర్వాత మాత్రమే అల్పాహారం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. మందు తీసుకున్న వెంటనే టీ, కాఫీ తాగడం మంచిది కాదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం చేయడం కూడా అవసరం. సోయా పదార్థాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం, జంక్ ఫుడ్, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలను తగ్గించడం మంచిది. క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేకపోయినా, అధికంగా ముడిగా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఉడికించి తీసుకుంటే ప్రమాదం తక్కువగా ఉంటుంది. థైరాయిడ్ సమస్య ఉన్నవారు ఉపవాసాలు ఎక్కువగా చేయడం, ఒక్కసారిగా బరువు తగ్గించే డైట్లు అనుసరించడం మంచిది కాదు. సమయానికి ఆహారం తీసుకోవడం, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ కూడా థైరాయిడ్ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ముఖ్యంగా వైద్యుల సలహా మేరకు రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆహార నియమాలను పాటిస్తే సమస్యను అదుపులో ఉంచుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. థైరాయిడ్ ఉన్న మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా కనిపిస్తుండటంతో పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. పండ్లు, ఆకుకూరలు, ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి శక్తి పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## మతిమరుపు పెరుగుతోందా?..

- గుండెజబ్బులకు ముందస్తు హెచ్చరిక కావొచ్చు
- జ్ఞాపకశక్తి తగ్గుదలను తేలికగా తీసుకోవద్దంటున్న నిపుణులు
- గుండెపోటు, పక్షవాతానికి ఏళ్ల ముందే కనిపించే సంకేతాలు
- వృద్ధుల్లో విషయగ్రహణ సామర్థ్యం తగ్గుదలపై తాజా పరిశోధన హెచ్చరిక





వయసు పెరిగే కొద్దీ జ్ఞాపకశక్తి మందగించడం సహజమనే భావన చాలా మందిలో ఉంటుంది. కానీ ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చాలా మంది మతిమరుపు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ విషయాలను మర్చిపోవడం, మాట్లాడుతున్నప్పుడు పదాలు గుర్తుకు రాకపోవడం, ఆలోచనల్లో తికమక పడటం వంటి లక్షణాలను సాధారణ సమస్యలుగానే తీసుకుంటున్నారు. అయితే ఇవే భవిష్యత్తులో వచ్చే గుండెజబ్బులకు ముందస్తు హెచ్చరికలు కావొచ్చని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. వైద్య నిపుణుల ప్రకారం గుండె ఆరోగ్యం దెబ్బతింటే దాని ప్రభావం మెదడు పనితీరుపై కూడా పడుతుంది. ఇప్పటి వరకు గుండెజబ్బులు వచ్చిన తర్వాతే మెదడు సామర్థ్యం తగ్గుతుందని భావించేవారు. కానీ తాజా అధ్యయనాల్లో గుండెపోటు లేదా గుండె వైఫల్యం సంభవించడానికి మూడు నుంచి ఎనిమిది ఏళ్ల ముందే విషయగ్రహణ సామర్థ్యం క్రమంగా క్షీణించడం ప్రారంభమవుతుందని గుర్తించారు. ముఖ్యంగా అరవై ఐదు ఏళ్లు దాటిన వారిలో ఈ మార్పులు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయని పరిశోధకులు వెల్లడించారు. తెలిసిన ప్రాంతాల్లోనే తిరగడానికి ఇబ్బంది పడటం, రోజువారీ పనుల్లో అయోమయం ఏర్పడటం, మాట్లాడేటప్పుడు సరైన పదం గుర్తుకు రాకపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం కావడం వంటి లక్షణాలు గమనించాల్సినవిగా నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు విషయాలను విశ్లేషించే వేగం తగ్గిపోవడం, ఒక పని నుంచి మరో పనికి దృష్టి మళ్లించడంలో ఇబ్బంది పడటం కూడా మెదడు పనితీరు బలహీనమవుతున్న సంకేతాలుగా భావిస్తున్నారు. ఈ మార్పులను ముందుగానే గుర్తిస్తే గుండెజబ్బులు, పక్షవాతం వంటి ప్రాణాపాయ పరిస్థితులను నివారించే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామం, సరైన నిద్ర, ఒత్తిడి నియంత్రణ ద్వారా గుండెతో పాటు మెదడు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలను నియంత్రణలో ఉంచుకోవడం ఎంతో అవసరమని చెబుతున్నారు. జ్ఞాపకశక్తిలో అకస్మాత్తుగా మార్పులు కనిపించినప్పుడు వాటిని వయసు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా తరచూ మతిమరుపు, తికమక, ఏకాగ్రత లోపం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలతో భవిష్యత్తులో వచ్చే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## 30 ప్లస్ వయసులో ఇమ్యూనిటీ పవర్ పెంచుకోవాలంటే ఇవి తప్పనిసరి

- ముప్పై దాటిన తర్వాత శరీరంలో వచ్చే మార్పులు
- ఇమ్యూనిటీ పెంచే ఆహార అలవాట్లు
- జీవనశైలిలో మార్పులతో ఆరోగ్య రక్షణ



ముప్పై సంవత్సరాల వయసు దాటిన తర్వాత శరీరంలో సహజంగానే రోగనిరోధక శక్తి కొంత తగ్గడం ప్రారంభమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి, నిద్రలేమి, అసమయ ఆహారం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో శరీరం త్వరగా అలసిపోవడం, తరచూ జలుబు, దగ్గు రావడం వంటి సమస్యలు కనిపిస్తాయని పేర్కొంటున్నారు. అందుకే ఈ వయసులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని సూచిస్తున్నారు. ఇమ్యూనిటీ పవర్ పెంచుకోవాలంటే పోషకాహారం చాలా ముఖ్యం. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పప్పులు, చేపలు, బాదం, వాల్‌నట్స్ వంటి పదార్థాలు ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, ఉసిరి, నిమ్మ వంటి పండ్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.ప్రోటీన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా కండరాలు బలపడటంతో పాటు శరీరానికి శక్తి పెరుగుతుంది. అలాగే తగినంత నీరు తాగడం వల్ల శరీరంలో విషపదార్థాలు బయటకు వెళ్లి ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ముప్పై ప్లస్ వయసులో నిద్ర కూడా చాలా కీలకం. రోజుకు కనీసం ఏడు గంటల నిద్ర తీసుకోవడం వల్ల శరీరం తిరిగి శక్తిని పొందుతుంది. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, మొబైల్ వినియోగం ఎక్కువగా ఉండడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రతిరోజూ యోగా, నడక, తేలికపాటి వ్యాయామం చేయడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడి శరీరం చురుకుగా ఉంటుంది. ప్రాణాయామం, ధ్యానం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను పెంచుతాయని చెబుతున్నారు. అ లాగే ధూమపానం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ఇమ్యూనిటీ పవర్‌కు ఎంతో మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

# బిజినెస్

## ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలు పెరిగే సూచనలు



**న్యూఢిల్లీ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** దేశంలోని ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థలు త్వరలో తమ ఉత్పత్తుల ధరలను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రముఖ సంస్థ డాబర్ ఇండియా వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నుంచి ధరల పెంపుపై ఆలోచిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చింది. డాబర్‌తో పాటు హిందుస్థాన్ యూనీలీవర్, నెస్లే, బ్రిటానియా వంటి దిగ్గజ కంపెనీలు కూడా ఇదే దారిలో వెళ్లే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, ప్యాకేజింగ్ వ్యయాలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు.పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా ఖర్చుల పెరుగుదలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ అమెరికా మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగా ముడి చమురు సరఫరాపై ప్రభావం పడుతోంది. దీనివల్ల రవాణా వ్యయాలు పెరగడంతో పాటు ప్లాస్టిక్ ప్యాకేజింగ్ పదార్థాల ధరలు కూడా భారీగా పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.బిస్కెట్లు, వంటనూనెలు, పాలు, కాఫీ, టీ పొడి వంటి ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల ధరలు నిరంతరం పెరుగుతుండటంతో కంపెనీలపై అదనపు భారం పడుతోంది.ఇక గ్రామీణ మార్కెట్‌లో డిమాండ్ క్రమంగా పుంజుకోవడం కూడా కంపెనీల నిర్ణయాలపై ప్రభావం చూపుతోంది. గత కొన్ని త్రైమాసికాలుగా మందగించిన గ్రామీణ వినియోగం ఇప్పుడు తిరిగి పెరుగుతున్నప్పటికీ, పెరుగుతున్న తయారీ వ్యయాల కారణంగా లాభాలను కాపాడుకోవడానికి ధరల పెంపు అవసరమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.ధరల పెరుగుదల ప్రభావం పలు నిత్యావసర ఉత్పత్తులపై పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సబ్బులు, షాంపూలు, డిటెర్జెంట్లు, టూత్‌పేస్టులు వంటి వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులతో పాటు బిస్కెట్లు, చిరుతిళ్లు, నూడుల్స్, చాక్లెట్లు వంటి ప్యాకేజ్డ్ ఫుడ్ వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.అలాగే పాలు, టీ, కాఫీ, శీతల పానీయాల ధరలు కూడా పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మరింత భారంగా మారే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏఐ ఆధారిత కొత్త టూల్‌ను తీసుకొచ్చిన ఫోన్‌పే



**బెంగళూరు, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** డిజిటల్ చెల్లింపుల రంగంలో ప్రముఖ సంస్థ ఫోన్‌పే వ్యాపారాల కోసం చెల్లింపు వ్యవస్థల అనుసంధాన ప్రక్రియను మరింత సులభతరం చేసే కొత్త ఏఐ ఆధారిత టూల్‌ను ప్రారంభించింది. ఈ సరికొత్త వ్యవస్థ ద్వారా గతంలో వారాల తరబడి పట్టే పేమెంట్ గేట్‌వే ఇంటిగ్రేషన్ ప్రక్రియను ఇప్పుడు కేవలం నిమిషాల్లో పూర్తి చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.కొత్త ఏఐ ఆధారిత ఇంటిగ్రేషన్ సిస్టమ్ సహాయంతో వ్యాపార సంస్థలు పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం లేకుండానే ఫోన్‌పే పేమెంట్ గేట్‌వేను తమ వ్యవస్థలతో సులభంగా అనుసంధానం చేసుకోవచ్చని తెలిపింది.ఇప్పటి వరకు ఈ ప్రక్రియలో కోడింగ్, డాక్యుమెంట్ల పరిశీలన, పలు సాంకేతిక మార్పులు అవసరమయ్యేవి. అయితే ఇప్పుడు ఏఐ ఏజెంట్ల సహాయంతో సాధారణ సంభాషణ తరహాలోనే మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని కంపెనీ అధికారులు పేర్కొన్నారు.ఈ ఏఐ కేవలం కోడ్ రాసే సాధనం మాత్రమే కాకుండా, చెల్లింపు వ్యవస్థల పనితీరును అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉందని వివరించారు. కంపెనీ రూపొందించిన ప్రత్యేక ఇంటిగ్రేషన్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కారణంగా మొత్తం ప్రక్రియ మరింత వేగవంతంగా, స్మార్ట్‌గా మారిందని తెలిపారు.ప్రత్యేకంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడనుందని కంపెనీ అభిప్రాయపడింది. సాధారణంగా ఈ తరహా సంస్థల్లో పెద్ద డెవలపర్ బృందాలు లేకపోవడం వల్ల చెల్లింపు వ్యవస్థల అనుసంధానం క్లిష్టంగా మారుతుందని, ఇప్పుడు ఏఐ టూల్‌తో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా వేగంగా ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభించవచ్చని పేర్కొంది.ఫోన్‌పే తెలిపిన వివరాల ప్రకారం, ఈ సిస్టమ్ అవసరమైన ఏపీఐలు, చెల్లింపు సెటప్‌లను స్వయంచాలకంగా గుర్తించి అమలు చేస్తుంది. అలాగే లోపాలను సరిచేసి అవసరమైన సాంకేతిక మెరుగుదలలను కూడా చేస్తుంది.దీంతో డెవలపర్ల సమయం గణనీయంగా ఆదా కావడంతో పాటు కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టవచ్చని కంపెనీ వెల్లడించింది. భవిష్యత్తులో కూడా మరిన్ని ఏఐ ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఫోన్‌పే యోచిస్తున్నట్లు తెలిపింది.

## అనిల్ అంబానీ సంస్థల్లో సీబీఐ సోదాలు



**న్యూఢిల్లీ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన పలు కార్యాలయాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ సోదాలు నిర్వహించింది. బ్యాంకు మోసం కేసులకు సంబంధించి ఈ తనిఖీలు చేపట్టినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ సంస్థలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు జరిగాయి.ముంబైలోని ఆయా కంపెనీల కార్యాలయాలతో పాటు డైరెక్టర్ల నివాసాల్లో కూడా తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 17 సంస్థలకు సంబంధించిన ప్రాంగణాల్లో సోదాలు చేపట్టినట్లు సీబీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.దర్యాప్తులో భాగంగా ఒకే చిరునామాతో పలు మధ్యవర్తి కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని తెలిపారు.ముంబైలోని ప్రత్యేక కోర్టు జారీ చేసిన సర్చ్ వారెంట్ ఆధారంగా ఈ సోదాలు నిర్వహించినట్లు సీబీఐ స్పష్టం చేసింది. అయితే ఈ అంశంపై స్పందించేందుకు సంబంధిత కంపెనీల ప్రతినిధులు నిరాకరించినట్లు సమాచారం.

## సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ బైకులను రీకాల్ చేసిన హోండా



**న్యూఢిల్లీ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ మోటర్‌సైకిళ్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. చమురు పైపుకు సంబంధించిన సాంకేతిక లోపాలు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. సెప్టెంబర్ 30, 2024 నుంచి ఆగస్టు 22, 2025 మధ్య తయారైన బైకుల్లో రెండు రకాల సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు హోండా తెలిపింది. ముఖ్యంగా ఇంధన సరఫరా గొట్టం అమరికలో లోపాలు ఉండే అవకాశముందని పేర్కొంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆ పైపు సరిగా బిగించబడకుండా ఉండే అవకాశం ఉందని, దీని వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రీకాల్ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ వెల్లడించింది.సంబంధిత బైకులను అధికారిక సర్వీస్ కేంద్రాలకు తీసుకువచ్చి తనిఖీ చేయించుకోవాలని వినియోగదారులకు సూచించింది. అవసరమైతే లోపభూయిష్ట భాగాలను ఉచితంగా మార్చి ఇస్తామని హోండా స్పష్టం చేసింది.వినియోగదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

## బ్యాంకాక్‌కు మకాం మార్చిన అవికా గోర్



తెలుగు ప్రేక్షకులకు 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా ఎంతో చేరువైన నటి అవికా గోర్ తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. టెలివిజన్ రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత తెలుగు చిత్రాల్లో హీరోయిన్‌గా కూడా మంచి అవకాశాలు దక్కించుకుంది. అయితే ఇటీవల ఆమె నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోవడంతో కెరీర్‌లో కొత్త మార్గాల కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అవికా గోర్ తన నివాసాన్ని భారతదేశం నుంచి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు మార్చుకున్నట్లు సమాచారం. వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించింది. బ్యాంకాక్ నగరం తనకు ఎంతో ఇష్టమని, అక్కడి జీవనశైలి, ప్రశాంతమైన వాతావరణం తనను బాగా ఆకట్టుకున్నాయని అవికా తెలిపింది. కొత్త సంస్కృతి, స్వేచ్ఛాయుత జీవనం తనలోని సృజనాత్మకతను మరింత పెంచుతాయని ఆమె అభిప్రాయపడింది.

## కమిట్‌మెంట్ పేరుతో ఇబ్బందులు ఎదుర్కొన్నా



జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి టెలివిజన్ షోల ద్వారా ప్రేక్షకులకు చేరువైన నటి ఐశ్వర్య తాజాగా తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. ప్రేమ, బ్రేకప్, సినీ పరిశ్రమలో ఎదురైన చేదు అనుభవాల గురించి ఓపెన్‌గా స్పందించింది. 'నాతో నేను' సినిమా ప్రమోషన్ల సమయంలో చేసిన ఓ స్కిట్ కారణంగా తన రిలేషన్‌షిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిందని ఐశ్వర్య తెలిపింది. చాలామంది అది నిజమైన ప్రేమ వ్యవహారమేనని, కొందరు అయితే పెళ్లి కూడా అయిపోయిందని భావించారని చెప్పింది. అయితే ఆ బంధం తర్వాత బ్రేకప్ జరిగిందని వెల్లడించిన ఆమె.. ప్రేమ అనేది ఎంతో విలువైనదని, కానీ దానికి అర్హత లేని వారు జీవితంలోకి వస్తే అది నిలబడదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం తాను సింగిల్‌గా సంతోషంగా ఉన్నానని, పెళ్లిపై ఇప్పట్లో పెద్దగా ఆసక్తి లేదని చెప్పింది. తల్లి చూసిన సంబంధాన్ని చేసుకోవడానికి సిద్ధమేనని, కానీ ముందుగా జీవితంలో పూర్తిగా స్థిరపడాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. సినీ పరిశ్రమలో ఎదురైన అనుభవాల గురించి మాట్లాడుతూ ఐశ్వర్య భావోద్వేగానికి గురైంది. కథలు వినడానికి వెళ్లిన సమయంలో ఇబ్బందులు ఎదురుకాలేదని, కానీ ఒప్పందం కుదిరే ముందు కొంతమంది నిర్మాతలు, దర్శకులు వ్యక్తిగత ఆసక్తి పేరుతో మాట్లాడేవారని వెల్లడించింది.

## 'ఆదర్శకుటుంబం హౌస్ నెం.47'పై భారీ ఆసక్తి




విక్టరీ వెంకటేశ్ హీరోగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'ఆదర్శకుటుంబం -- హౌస్ నెం.47'పై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'ఏకే 47' అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా గురించి రోజుకో ఆసక్తికర విషయం బయటకు వస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో వెంకటేశ్ పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో ఆయన 'రా ఏజెంట్' పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అయితే ఇది సాధారణ స్పై థ్రిల్లర్ తరహాలో కాకుండా, పాత్రకు ప్రత్యేకమైన లోపాన్ని జోడిస్తూ దర్శకుడు త్రివిక్రమ్ కథను డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. వెంకటేశ్ పాత్రకు దృష్టి లోపం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో కూడా రా ఏజెంట్‌గా ఆయన మిషన్లను ఎలా పూర్తి చేశాడు, ప్రమాదకర ఛేజ్‌లను ఎలా ఎదుర్కొన్నాడు అనే అంశాలను ఉత్కంఠభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదాన్ని మేళవిస్తూ త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఫ్యామిలీ డ్రామాతో పాటు స్టైలిష్ స్పై యాక్షన్ అంశాలు కూడా ఉండటంతో సినిమా స్థాయి మరింత పెరిగినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నాడు. 'మీర్జాపూర్' వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందిన ఆయన ఈ సినిమాలో తీవ్రవాదిగా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కథలో కీలక మలుపులకు ఆయన పాత్ర కారణమవుతుందని సమాచారం. హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. నిర్మాణ విలువల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా భారీ స్థాయిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ -- త్రివిక్రమ్ కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆదరణ ఉంది.

## 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సంచలనం..

### - ఐపీఎల్‌లో కొత్త చరిత్ర

**న్యూఢిల్లీ, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026



సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేదికపై సీనియర్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ అరుదైన రికార్డులు సృష్టిస్తున్నాడు. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి మరోసారి మెరుపులు మెరిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారతీయ బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు వైభవ్ ఏకంగా 43 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ 42 సిక్సర్లతో ఈ రికార్డు సృష్టించగా.. ఇప్పుడు వైభవ్ ఆ ఘనతను అధిగమించాడు. వైభవ్ కొట్టిన 43 సిక్సర్లలో 35 సిక్సర్లు పవర్‌ప్లేలోనే రావడం అతని దూకుడు బ్యాటింగ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. మొదటి ఆరు ఓవర్లలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాలు అందిస్తున్నాడు. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో లుంగి ఎంగిడి వేసిన తొలి బంతికే భారీ సిక్సర్ బాదిన వైభవ్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో మూడుసార్లు తొలి బంతికే సిక్సర్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఇంతకుముందు షారుఖ్ ఖాన్, సునీల్ నరైన్, దేవదత్ పడిక్కల్ ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు వైభవ్ కూడా వారి సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ 486 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 234.78 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. కేవలం 14 పరుగుల తేడాతో 500 పరుగుల మైలురాయిని చేజార్చుకున్నప్పటికీ.. అతని విధ్వంసకర ఆటతీరు చూసి భవిష్యత్తులో భారత జట్టుకు గొప్ప స్టార్ దొరికాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పంజాబ్ పతనంపై అశ్విన్ ఆగ్రహం

### - ఫ్రాంచైజీ నిర్ణయాలే కారణమన్న వెటరన్



**హైదరాబాద్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు ముగిసినట్టయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓటమి పాలైన పంజాబ్ వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూసింది. దీంతో ఆ జట్టు ప్లేఆఫ్స్ రేసులో తీవ్ర సంక్షోభంలో పడింది. మ్యాచ్ అనంతరం డగౌట్‌లో హెడ్ కోచ్ రికీ పాంటింగ్ తీవ్ర నిరాశతో ఒంటరిగా కూర్చున్న దృశ్యం అభిమానులను కలచివేసింది. ఈ విషయంపై టీమిండియా వెటరన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో ఘాటుగా స్పందించాడు. పంజాబ్ కింగ్స్ ప్రస్తుత పరిస్థితికి ఫ్రాంచైజీ యాజమాన్యమే ప్రధాన కారణమని విమర్శించాడు. రెండు వేర్వేరు హోం గ్రౌండ్‌లలో మ్యాచ్‌లు నిర్వహించాలన్న నిర్ణయం జట్టును దెబ్బతీసిందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "ఈ సీజన్‌లో టాప్-2లో ఉండాల్సిన జట్టు ఇప్పుడు ఇలాంటి పరిస్థితికి రావడం బాధాకరం. నేను 2018లో ఇదే పరిస్థితిని అనుభవించాను. ఛాంపియన్ జట్లు ఎప్పుడూ రెండు లేదా మూడు హోం గ్రౌండ్‌లలో ఆడవు" అని అశ్విన్ పేర్కొన్నాడు. మొహాలీలో వరుస విజయాలతో ఊపుమీదున్న జట్టు.. ధర్మశాలకు వెళ్లిన తర్వాత వరుస ఓటములు చవిచూసిందని గుర్తు చేశాడు. "మొహాలీ, ధర్మశాల పిచ్‌ల మధ్య చాలా తేడా ఉంటుంది. పేస్, బౌన్స్ పూర్తిగా మారిపోతాయి. ఎత్తు ప్రభావం కూడా ఉంటుంది. దీనివల్ల యువ ఆటగాళ్లు, విదేశీ క్రికెటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు" అని చెప్పాడు. క్రికెట్ అవసరాల కంటే వ్యాపార ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అశ్విన్ విమర్శించాడు. "ధర్మశాలలో ఒక్క మ్యాచ్ గెలిచినా పరిస్థితి వేరేలా ఉండేది. ఈ పరిస్థితికి రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చాలా బాధపడతారు. గెలవాలంటే సొంత మైదాన ప్రయోజనాన్ని వదులుకోకూడదు" అని ఘాటుగా వ్యాఖ్యానించాడు. కాగా, పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ చివరి లీగ్ మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

## ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరం..

**హైదరాబాద్, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగింపుకు చేరుకుంటున్న వేళ ప్లే ఆఫ్స్ సమీకరణాలు అత్యంత ఉత్కంఠభరితంగా మారాయి. ఇప్పటివరకు మొత్తం 62 లీగ్ మ్యాచ్‌లు పూర్తికాగా, పాయింట్ల పట్టికలో 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఆర్సీబీ తన తదుపరి మ్యాచ్‌లో కూడా విజయం సాధిస్తే టాప్-2లో నిలిచి క్వాలిఫైయర్-1 ఆడే అవకాశాలు మరింత బలపడనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు పేలవ ప్రదర్శనతో ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక మిగిలిన మూడు ప్లే ఆఫ్స్ స్థానాల కోసం ప్రస్తుతం ఏడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ చేరడం దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. గణాంకాల ప్రకారం ఆ జట్టుకు 99.20 శాతం అవకాశాలు ఉన్నాయి. మరో మ్యాచ్ గెలిస్తే గుజరాత్ క్వాలిఫైయర్-1కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఇక 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రస్తుతం 75 శాతం అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సన్‌రైజర్స్ తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో చెన్నైలో జరగబోయే సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్ దారి మరింత సులువవుతుంది. ఒకవేళ ఓడిపోతే చివరి మ్యాచ్‌లో ఆర్సీబీపై భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి రావచ్చు. అప్పుడు రన్‌రేట్ సమీకరణాలు కూడా కీలకంగా మారనున్నాయి. లీగ్ దశ చివరి మ్యాచ్‌లు దగ్గరపడుతున్న కొద్దీ ప్లే ఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.




## సూర్య కెప్టెన్సీపై బీసీసీఐ కీలక చర్చలు



**గువాహటి, మే 19 మన ప్రజాగళం న్యూస్ :** భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తుపై బీసీసీఐ త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గువాహటిలో మంగళవారం బీసీసీఐ సెలక్షన్ కమిటీ సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సూచనలు కీలకంగా మారనున్నాయని క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరఫున కూడా అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో అతని కెప్టెన్సీపై సెలక్టర్లు సమీక్ష జరపనున్నట్లు సమాచారం. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం కొత్త నాయకత్వ ప్రణాళికపై కూడా ఈ భేటీలో చర్చించే అవకాశముంది. టీ20 ప్రపంచకప్ విజయానంతరం సూర్య నాయకత్వంపై జరుగుతున్న తొలి కీలక సమావేశం ఇదే కావడం విశేషం. మరోవైపు రిషబ్ పంత్ భవిష్యత్తుపైనా సెలక్షన్ కమిటీ ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టు, వన్డే సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక సమయంలో పంత్ టెస్ట్ వైస్ కెప్టెన్సీ అంశం కూడా పరిశీలనకు రానుంది. పంత్‌కు నాయకత్వ బాధ్యతలు పెద్దగా కలిసి రావడం లేదని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. గత ఏడాది సౌతాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతని కెప్టెన్సీ వ్యూహాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. నాయకత్వ భారం కారణంగా పంత్ తన సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను కోల్పోతున్నాడని బోర్డు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అతనిపై ఒత్తిడి తగ్గించే దిశగా ఆలోచనలు జరుగుతున్నాయని సమాచారం. ఇక వన్డే జట్టులో రెండో వికెట్ కీపర్ స్థానం కోసం కూడా తీవ్ర పోటీ నెలకొంది. ధ్రువ్ జురెల్, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ బలమైన పోటీదారులుగా నిలవడంతో పంత్ స్థానంపై అనిశ్చితి నెలకొంది.